


# తీగ

**- ఆచార్య కొలకలూరి ఇనాక్**

'బిడ్డ సెడిపోతదని బయింబుడతాంది' అన్నాడు గోవిందరాజులు మెటికలెక్కీ పైకి వచ్చి పేపరు చదువుకొంటున్న వినాయక్‌తో ఎదురుగా నిలబడి.

'కూచో'అన్నాడు వినాయక్ కుర్చీ జరుపుతూ. 'యేం కూసోటంవో యేంవో దేవరా. బిడ్డ సేయి దాటిపోతదని మనేదబట్టుకొనింది' అన్నాడు. గోడకానుకొని కుందు కూర్చుంటూ, కుర్చీ పక్కకునెట్టి.

'ఇప్పుడేవయింది?'అని అడిగితే, 'యావయినాదనిగాదు దేవరా, యావయితాదని' అన్నాడు.

ఏదో పెద్ద సమస్యగానే ఉందని వినాయక్ ఏమీ మాట్లాడకుండా పేపరు పక్కనబెట్టి లోనికిపోయి, కాఫీ గ్లాసు తెచ్చి ఇచ్చి 'బిడ్డ కుశలమేనా?' అంటే 'యేంకుసెలంవో యాంవో'అని నిట్టూర్పు విడిచాడు.

⁂

అనంతపురం నాలుగో రోడ్డులో వడ్డెగేరి నానుకొని చిన్న చిన్న పనులు వృత్తులు వ్యాపకాల్తో జీవితం కొనసాగిస్తున్న జనం, గవర్నమెంటు స్థలం ఆక్రమించుకొని కొట్టాలు వేసుకొన్నారు. పట్టాలు పొందారు.

బేల్‌దారు కూలిగా చేరి, బేల్‌దారుగా మారి, బేల్‌దారు మేస్త్రీగా పనితనంవల్ల పైకి వచ్చిన గోవిందరాజుల కొట్టం- మిద్దెగా- మాడిగా మారి ఆ స్థలంలోనే ఉంది. ఇప్పుడు వయస్సు అంతగా లేదు కాని, పనిచేసే ఓపిక లేక, చేంచే శక్తిలేక యాభై ఏళ్ళయినా రాకముందే, పనిమానేసి, చేతి కొచ్చిన కర్రను తాటించుకొంటూ ఆడాఈడా తిరుగుతూ ఉన్నాడు.

గోవిందరాజులు పద్దైదేళ్ళ క్రితం బేల్‌దారు మేస్త్రీగా పరిచయమై, వినాయక్ ఇల్లు గట్టిగా కట్టించి, మిత్రుడై అప్పుడప్పుడు వస్తూపోతూ ఇంటి పరిస్థితులు కూతురి విషయాలు చెప్పుకొంటూ ఉంటాడు. అవసరమైన సలహాలు సూచనలు అడిగి, పొంది, వాటిని అమలుచేసి, ఆనందమే పొందుతూ వచ్చిన మనిషి బాధపడుతున్నట్లు కనబడుతుంటే ఆర్ట్ కాలేజీ ప్రిన్సిపాలుగా ఉన్న వినాయక్ అతణ్ణి ఓదార్చవలసిన అవసరం ఉందని గుర్తించాడు.

'బిడ్డని సదవనిద్దాంవని, నేనంటే లగ్గం సెద్దాంవంటాంది తాను. యేం సేయ్యనుదేవరా' అని అడిగాడు పద్దైళ్ళ పూర్వం.

'పాప వయస్సెంత'.

'పద్దైదు!'

'చదివించు!'

'యేం సదవల్ల'.

'పాపనడిగి చెబుతాను' అంటే తల ఊపుతూ పోయి కూతుర్ని తొడ్కొని వచ్చాడు.

అదే లతను మొదటిసారి చూడటం. పచ్చగా ఉంది. మెటిక్కాయలాగా ఉంది. వేలెడంత ఉంది. మాట్లాడిస్తే పొట్టి మిరపకాయ అనిపించింది.

గోవిందరాజులే ఐదడుగుల పిట్టమనిషి. కూతురు నాలుగున్నర అడుగులుంటే ఎక్కువ. పీల పాప. పల్చని ప్రాణి. గాలి తోలితే కిందపడేంత బలం. గాల్లేకపోతే నడవ్వచ్చు.

ఇంటర్‌లో బైపిసి సీటు వచ్చింది లతకి వినాయక్ ఇచ్చాడని అందరికీ చెబుతుంది.

ఆకు ఎగురుతున్నట్లు ఎగురుతూ మెట్లు ఎక్కేది, దిగేది. ఈ బక్క ప్రాణి ఆ పుస్తకాలు మోయగలదా అనిపించేది. తెలివైన పాప. చురుకైన బుద్ధి. నిలకడ లేని కళ్ళు. నిశితంగా చూచే చూపు.

గోవిందరాజులు ఇల్లు కట్టించి కాంపౌండు గోడ కట్టించి వినాయక్‌కి ఇష్టమని ఇంటిచుట్టూ ఖాళీ జాగాలో ఆరు వేప చెట్లు, అమ్మయ్యకు ఇష్టమని మల్లె మొక్క, సన్న జాజి తీగ, పక్కనే టెంకాయ మొక్క పెట్టాడు. మల్లె మొక్క పొద అయింది. సన్నజాజికి పందిరి కావలసి వచ్చింది. చిన్న పందిరి పెద్ద పందిరి అయింది. హైబ్రిడ్ టెంకాయ చెట్టు ఇబ్బడి ముబ్బడిగా గెలలు నిండా దండిగా కాయలు కాస్తూ ఉంది.

గోవిందరాజులు టెంకాయలు దింపించాలని గుర్తుచేస్తే 'దింపించు' అన్నాడు వినాయక్.

అతను ఎప్పుడు ఇంటికి వచ్చినా ఈ పూలు, మొక్కలు చూసి సంతోషపడుతూ సూచనలిస్తూ ఉంటాడు.

టెంకాయ మట్టలు పూల పందిళ్ళమీద పడి అడ్డవవుతుంటే అమ్మయ్య అంగలార్చింది.

'యెంత అమ్మయ్య, యియ్యి యీడే ఉంటయ్యా? మల్లీ ఏటికి అది పైకి పోతది. అడ్డంవే ఉండదు. నీడే పడదు. యియ్యి పూలు బూత్తయ్యి. అది కాయలు కాత్తది' అని ధైర్యం చెప్పాడు.

గోవిందరాజులు అన్నట్లుగానే మల్లె పొద నేలమీదే ఉంది. సన్నజాజి పందిరి మీదే ఉంది. టెంకాయ చెట్టు ఆకాశంలోకి పోయింది.

ఇంటర్‌లో 90 శాతం మార్కులు వచ్చాయి లతకు. ఎంసెట్ రాయనంది. బి.ఎస్సి. చదువుతానంది.

మళ్ళీ ఇంట్లోగోల. లగ్గమంటుంది తల్లి. చదివిద్దామంటున్నాడు తండ్రి.

వినాయక్ మధ్యవర్తి. 'చదివించండి!' అతడి మాట గురి. 'మడి మూడేండ్లు' గొణుగుతూ వెళ్ళింది తల్లి. సంతోషంగా ఉన్నాడు తండ్రి.

'ఏం గ్రూపు?' వినాయక్ లతను అడిగాడు.

'మీ యిష్టం!' అంది.

'కంప్యూటర్స్'.

ఎగిరి గంతేసింది. రోగి కోరిన మందు, డాక్టరు ఇచ్చిన మందు ఒకటే అయ్యాయి.

గోవిందరాజులుకు ఒక్కతే కూతురు. గారాం ఎక్కువ. కూతురు చదువుకొంటుంటే తల్లి అన్నం ముద్దలు పెడుతుంది. లత చదువుతుండగానే తల దువ్వి, పూలు పెట్టి, బొట్టూకాటుక పెట్టి, చెప్పులిచ్చి కాలేజికి పంపుతుంది తల్లి.

'నీ బరువెంత?' ఒకరోజు వినాయక్ అడిగాడు.

'ముప్పైఅయిదు' అంది లత.

'లాభం లేదు'అంటే తలూపింది. 'తినాలి' అంటే 'ఊఁ!' అంది. 'పది కేజీలన్నా పెరగాలి'అని కోరితే 'సరే'నంది. కానీ ఏమీ ప్రయత్నించిన దాఖలాలు లేవు.

ఒకరోజు గోవిందరాజులు వచ్చి మల్లె పొద కత్తెరించాడు. 'సిగుల్లు వత్తయి. పూలు దండిగా పూత్తయ్యి'అని చెప్పాడు. ఆమె సంతోషించింది. సన్నజాజి తీగలు పైకి పెరిగి, ఒకదానితో ఒకటి కలబడి, మెలబడి నిలబడ్డాయి. కొంతకాలం నిలబడి, పెరిగి, టెంకాయ చెట్టును వాటేసుకొన్నాయి.

వాటిని కత్తెరిస్తానన్నాడు గోవిందరాజులు. 'పెరగనీ'అన్నాడు వినాయక్.

వినాయక్‌కు చాలా చిన్నప్పుడే పెళ్ళయింది. పిల్లలు పెళ్ళిళ్ళయి, ఉద్యోగాల్లో చేరి, దేశం మీదికి తమనుతాము వెదజల్లుకొన్నారు వాళ్ళు. నలభై అయిదేళ్ళు వచ్చేసరికే తానూ, తన భార్య మాత్రమే లంకంత ఇంటిలో ఏకాంతంగా మిగిలిపోయారు. పై పోర్షన్లు రెండూ అద్దెకిచ్చారు.

లతకు 'మనుంచేసి పంపకుంటే నే పుట్టింటికి' పోతానని భార్య బెదిరిస్తే 'నేనెట్టా జచ్చేదింతో'అంటూ వచ్చాడు గోవిందరాజులు.

లతకిష్టమైతే, అనంతపురంలోనే యంసిఏ గానీ యం.బి.ఏ. గానీ చేయించమని వినాయక్ సలహా ఇచ్చాడు పాప బి.యస్సి రిజల్ట్సు చూసి. 'దాని తల్లిన్దోల కత్తా'అని వెళ్ళాడు లత తండ్రి.

'బెంగుళూరులో ఉండగలవా?'

'ఓఁ! ఉద్యోగం రావాలే గాని!'

ప్రకటనలోనే యం.బి.ఏ. కానీ, యం.సి.ఏ కానీ ఉద్యోగం చేస్తూనే, చదువుకోవాలని కూడా ఉంది.

తనొకటి, తన భార్య ఒకటి రెండు టెస్టిమోనియల్స్ ఇస్తే తండ్రితో కలిసి ఇంటర్వ్యూకు వెళ్ళింది లత.

ఐటి కంపెని వాళ్ళు 'ప్రిన్సిపాల్ నీకు తెలుసా?' అంటే నాకు తండ్రి అంతటి వాడని సమాధానం చెప్పిందట లత. 'ఇంటర్‌నెట్‌లో రిజల్ట్సు చూసుకో'మన్నారని చెప్పింది ఊరికి రాగానే.

నెలకు ట్రయినింగులో ఏడువేలు ఇస్తారు. రెండేళ్ళు లత చదువుమీద వాళ్ళు పెట్టే ఖర్చుకు ష్యూరిటీ కావాలన్నారు. తాను 'ష్యూరిటీ ఇస్తానంటే' మీరు చెబితే చాలునన్నారువాళ్ళు.

లత అప్రెంటిస్‌గా చేరింది ఐ.టి. కంపెనీలో.

బెంగుళూరు వెళ్ళేరోజు కాళ్ళకు మొక్కింది. 'నీ జీతం ఏం చేసుకొంటా'వని వినాయక్ అడిగితే 'నాయనకిస్తా'నంది. 'నీ ఖర్చులకు కావద్దా'అంటే 'నాయన్నడుగుతా'నంది. 'నీకు నెలకు ఎంత కావలసి వస్తుందంటే' 'వెయ్యి'అంది.

రెండేళ్ళలో యం.బి.ఏ. చేసింది. ఇరవై ఏడువేల జీతం నిర్ణయించారు. తనంతట తాను యం.సి.ఏ. కూడా చేసింది. జీతం ముప్ఫైఅయిదు వేలు చేశారు. అయిదేళ్ళలో గ్రూపు లీడరయింది. సొంతంగా ప్రాజెక్టులు చేస్తూ ఉంది. చేయిస్తూ ఉంది.

తండ్రికి ప్రతినెలా ఆరువేల రూపాయలు పంపుతూ ఉంది. అది గోవిందరాజులకు భార్యకు సరిపోతూ ఉంది. మిగతా జీతం 'ఏం చేసుకొంటున్నావు'అని తండ్రి అడిగితే బేంకులో వేసుకొంటున్నానని చెప్పింది.

అయిదేళ్ళ కిందట మొగుడూ పెళ్ళాం కూడబలుక్కొని వచ్చారు.

'దానికి పాతికేళ్ళు! పెళ్ళీడు దాటిపోతాంది' అంది అతడి భార్య.

'అయిన బంధుత్వం ఉందా?'అని అడిగితే ఆ 'లేకేం ఉండాలి' అంది. 'పిల్లవాడు ఏం చేస్తాడంటే ఎలెక్ట్రీషియన్ అని చెప్పింది. 'పాప ఒప్పుకొందా' అంటే 'ఒప్పుకోలేదంది'. అందుకే లతతో మాట్లాడి పెళ్ళికి ఒప్పించమని అడిగారు వాళ్ళు.

వినాయక్ ఫోనుచేస్తే మరి ఐదేళ్ళదాకా పెళ్ళి చేసుకోనని, జీవితంలో, నాకు కొన్ని ఆశలు, ఆశయాలు ఉన్నాయని అర్థం చేసుకోమని ప్రార్థించింది. ఎంతగా ఒప్పించే ప్రయత్నంచేసినా అంత స్థిరంగా, నిశ్చయం తేల్చి చెప్పింది. సొంత తల్లితండ్రుల కంటే ఎక్కువగా అడిగిన వినాయక్‌ను కూడా లత కాదంది అని వాళ్ళు ఇద్దరూ మండిపడి 'సచ్చినాదిలే పాడుముండ. పాతిపెట్టినామని యేడిసి మరిసిపోతే పాయ'అని వెళ్లిపోయారు.

సన్నజాజి పందిరి తీగ టెంకాయ చెట్టును చుట్టుకొని పైకిపోయి మట్టమీదగా పాకి, పై పోర్షనులో ఉన్న వాళ్ళ ఇంటి ముందట సిటౌట్ రైలింగును అల్లుకొని అటూ ఇటూ వ్యాపించి పూలు పూస్తూ ఉంది.

ఆ పోర్షన్‌లో అద్దెకుంటున్న ఆమే, ఆమె కూతురూ రోజు పూలు కొనుక్కొని మాలలు కట్టుకొని ముళ్ళో, జళ్ళో పెట్టుకొని మురిసిపోతూ ఉన్నారు.

తీగ మీది ప్రేమ పాదుమీద చూపటానికన్నట్లు బిందె నీళ్ళు పోసి కృతజ్ఞత చూపుకొంటూ ఉండసాగారు.

టెంకాయ మట్ట పచ్చిదనం పోయి, ఎండిపోయి, టెంకా చెట్టునుంచి ఊడిపోయి, నేల బడక, తీగను పట్టుకొని నేలబడుతుంటే, తీగ గట్టిపడి, బలం పుంజుకొని సిటౌట్ రైలింగుతో పెనవేసుకుపోయి, క్రమంగా మట్ట రాలిపోయినా నిలబడ గలిగింది.

లత వచ్చి రెండూ మూడు రోజులుంటే తల్లిదండ్రులు ముభావంగానే ఉండేవాళ్ళు. సరిగ్గా పలకరించేవాళ్లు కారు.

> 'ఎక్కడో కింద నేల మీది ఉండే తీగ ఎంత ఎత్తుకు వచ్చింది ఎన్ని పూలు పూసింది. కింద అమ్మయ్యకు, పై పోర్షన్‌లో అక్కయ్యకు, ఇక్కడ గాలికి పరిమళం పంపుతున్న తీగ జీవితం ధన్యమేకదా!'

గలగల లాడే లత వినాయక్‌తో 'నేను పది కేజీలు బరువు పెరిగానంది'. 'ఇప్పటికా'అంటే అవునంది. 'ఎంత బరువంటే నలభైఅయిదు కేజీలంది. అతను నవ్వేశాడు తాను తెచ్చినవన్నీ తల్లిదండ్రులకు ఇచ్చినట్లే 'రాడో' వాచీ అతడికి బహూకరించింది. 'నాకెందుకమ్మా'అంటే 'మీ పుణ్యం' అంది. 'నీ పెళ్ళెప్పుడంటే' తొందరలోనే మీరు వచ్చి మా పెళ్ళి చేద్దురుగాని అని వెళ్ళిపోయింది.

లత తల్లిదండ్రులు తమ చేతుల్లో ఏమీలేదని, అంతా ఆమె ఇష్టమేనని గుర్తించి, తాము పెళ్ళి ప్రస్తావన తేవటం మానేశారు.

పై పోర్షన్‌లో ఉన్న సన్నజాజి తీగలు పెనవేసుకొని కరెంటు తీగను పట్టుకొని పైకి పోయి, మిద్దె పైన ఉన్న రైలింగులను చుట్టుకొని చుట్టూ వ్యాపించి పూలు పూసి గాలికి పరీమళం పందేరం చేస్తున్నాయి. ఆ ఇళ్ళలో ఎవరికీ అన్ని సన్నజాజులు అవసరం లేకపోయాయి.

★★★

'ఏం గోవిందూ, ఏమీ మాట్లాడక కూర్చున్నావూ?' అన్నాడు వినాయక్.

'మేం మాట్లాడేది దేవరా! బిడ్డ సెడిపోయినట్టే! సేయి దాటిపోయినట్టే!'

'కన్నబిడ్డ గొప్పదయిందనుకోవాలి గాని మరేం అనుకోనక్కరలేదు.'

'నికిలు యేఁవిటోడో, యేం వూరో, యేం బాసో యట్టాటోడో యాఁవీ తెలపదే! యట్టా వొప్పల్లా'.

'లతకు నచ్చాడు. అంతే చాలు. పాపకిప్పుడు ముప్ఫై ఏళ్ళు. లోకం బాగా తెలుసు. బెంగుళూరు- మనుషులు- స్వభావాలు బాగా అర్థంచేసుకొంది. నిఖిల్ తనతోపాటు ఉద్యోగం చేస్తున్నాడు. సంపన్నుడు. తెలివి గల్లవాడు. అమ్మాయికి ఇష్టమయ్యాడు. ఇద్దరూ కలిసి బయటికి వచ్చి సొంతంగా ఐటి కంపెనీ పెట్టుకొన్నారు. ఇద్దరూ భాగస్థులే! భార్యాభర్తా కావటమే ఆలస్యం. పాప అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకొంది. నాకు అన్ని విషయాలు చెప్పింది. ఇంతకాలం నన్ను అంకుల్ అదే లత నిన్న నన్ను డాడీ అని కూడా అంది. నాకీ సంబంధం పూర్తిగా ఇష్టమయింది. పిల్లల ఆలోచనల్ని మనం గౌరవించాలి.

'అమ్మా అప్పా అని యిప్పుడిటేఁవో చెమలుగానే ఉంటది గాని ముందుకేమయితదో యాఁవనగలఁవ్?'

'నేనీ విషయం లతతో మాట్లాడాను. అమ్మానాన్నల సంగతేమిటని. నెలకి పదివేలు పంపుతానంది. మాట ఇస్తే తప్పదని తెలుసుకదా!'

అంతలో గోవిందరాజుల భార్య కూడా వచ్చింది. 'మొండిది. దానిమాటే మాట. మరింకో మాట సెవినేసుకోదు. లగ్గఁవయితే సాలు- యెప్పుడు సావిలగ్గం' అంది.

'తేదీ ఇద్దరూ మాట్లాడుకొని చెబుతారన్నారు. గుడి పెళ్ళికాదు. గవర్నమెంటు పెళ్ళి. పెళ్ళికి మనమందరం పోదాం.'

'మేమేల సాఁవి? మేం రావి సాఁవి'అన్నారు ఇద్దరూ ఒకేసారి.

మళ్ళీ చాలాసేపు నచ్చచెబితే 'మీ యిష్టం సాఁవి' అన్నారు. కాలం, పిల్లలు, మనస్తత్వాలు, ఆలోచనలు, అభివృద్ధి, అవసరాలు చాలా విషయాలు నలభై ఏళ్ళుగా పాఠం చెప్పిన వినాయక్ విడమరిచి రెండు గంటల్నుంచి వీలయినప్పుడల్లా చెబుతూ రాగా 'మేంగాని వచ్చేదేలే సాఁది' అన్నారు.

భార్యాభర్తల్ని మేడమీదికి తీసుకుపోయి ఆమెను సన్నజాజులు కోసుకొమ్మంటే వడినిండా కోసుకొంది.

'ఈ తీగకి ఇంకా ఆధారం ఉంటే మరింత పైకిపోతుంది. పందిరి లేదు కదా! ఆగిపోయింది. అందుకే పెళ్ళి చేసుకొంటానంది' అన్నాడు వినాయక్. వాళ్ళిద్దరూ బిత్తరపోయి చూశారు.

'ఎక్కడో కింద నేల మీది ఉండే తీగ ఎంత ఎత్తుకు వచ్చింది ఎన్ని పూలు పూసింది. కింద అమ్మయ్యకు, పై పోర్షన్‌లో అక్కయ్యకు, ఇక్కడ గాలికి పరిమళం పంపుతున్న తీగ జీవితం ధన్యమేకదా!'

ముగ్గురూ కిందికి దిగి వచ్చారు. 'ఈ పాదు నువ్వేనమ్మ- ఈ పందిరి నువ్వ గోవిందు, ఆ టెంకాయ చెట్టు నేను. పై పోర్షన్ రైలింగు ఉద్యోగం టెలిఫోను తీగా, కరెంటు వైరూ కలగలిసి నిఖిల్, పై రైలింగు వాళ్ళ ఐటి కంపెని. నీ తీగ-లత ఎంతెత్తు పెరిగిందో చూడు!'

భార్యాభర్తలిద్దరూ ఏమో అర్థమయినట్లు వెలిగిపోతున్నారు.

'పిల్లలిద్దరినీ దీవించి వద్దాం! సరేనా?'

'దీవించేదే! ముందుగానే పోయొద్దాఁవు సాఁవి పది రోజులు, పోయొద్దాఁవు సాఁవి' అన్నారిద్దరు.

కిందనుంచి పైకి ఎగబాకిన తీగ గాలికి ఊగూగి నవ్వుతూ ఉంది విచ్చుకొనే మొగ్గలతో.

★